తెలుగు కళాసమితి న్యూజెర్సీ రాజాలక్ష్మి ఫౌండేషన్‌వారి కథల పోటీలో రూ. 500/-లు బహుమతి గెలుచుకున్న కథ.

# ప్రణవీ! ప్రణవీ

– డాక్టర్ కిన్నెర ప్రసూన



కారిడార్‌లో నడిచి వెళుతూంటే వందలాది కళ్ళు విస్మయంగా, గౌరవంగా, ఆరాధనగా చూసే ప్రణవి!

ప్రతి సంవత్సరము కొత్త పిల్లల్ని ఆహ్వానించే ‘వెల్ కమ్ మీట్’లో హెడ్‌మిస్ట్రెస్ నోటి వెంట కథగా వినపడే పేరు ప్రణవి.

సెవెంత్‌లో జిల్లా ఫస్ట్. అన్ని సబ్జక్టుల్లో ఎప్పుడూ తనే ఫస్ట్. ఇప్పుడు ప్రణవి టెన్త్‌కు వచ్చింది. అందరి కళ్ళు ఆమెమీదే. రాంక్ సరే అది ఎటూ గ్యారంటీ కాని స్టేట్ ఫస్ట్. అది సాధించగలదా అనేది అందరిలో ఉత్కంఠ పరిచే విషయము.

“ఇఫ్ యు కెన్ డ్రీమ్ యిట్ – యుకెన్ బికమ్ ఇట్” ప్రణవి విజయానికి తారకమంత్రాలైన మాటలివే.

** ** **

వజయ స్కూల్లో చేరిన పది రోజులకే అనార్కిస్ట్‌గా పేరు తెచ్చుకొంది. ప్రణవితో మాట్లాడ్డం ఒక గొప్ప గౌరవంగా భావిస్తారు అందరు పిల్లలూ.

“అదో కొయ్యబొమ్మ. దానితో మాట్లాడినా బ్లాక్ బోర్డుతో మాట్లాడినా ఒకటే” వజయ కామెంట్‌తో షాక్ తింది క్లాసంతా. “యస్ ఐ మీన్ యిట్! దానికి రాబోట్‌కి తేడా లేదు. కంప్యూటర్‌కి ఎన్ని తెలివి తేటలున్నా దానితో స్నేహం చెయలేము కదా!” ప్రణవి కోపంగా, అసహ్యంగా చూసింది. వజయ కళ్ళలో అల్లరి! కేరింత!

ఒకరోజు క్లాసులో ప్రణవి, వజయ పక్క, పక్కనే కూర్చోవాల్సి వచ్చింది. అది బయోలాజికల్ సైన్సు క్లాసు. బాక్టీరియాల గురించి, వైరస్‌ల గురించి చెప్పుతూంది టీచర్. రన్నింగ్ నోట్సు రాసుకొంటున్న ప్రణవి ఉలిక్కిపడి పక్కకు చూసింది. వజయ తన నోట్ బుక్కులో ఒక కుర్రవాడి బొమ్మను వేస్తూంది. “హి ఈజ్ మై డ్రీమ్ బాయ్!” సన్నగా గొణిగింది వజయ. ఆ కుర్రవాడు ఎవరా అన్నట్లు వింతగా చూసిందా బొమ్మ వైపు ప్రణవి. “ఈ కుర్రావాడెవరో నాకు తెలీదన కు. నీ పక్కన కూర్చున్నందుకు నేను పశ్చాత్తాప పడవలసి వస్తుంది” ప్రణవి కంగారు పడింది. ఎక్కడో చూసిన గుర్తు. పేరు గుర్తుకు రావట్లేదు. “గాడ్! నీ గురించి నా అనుమానం నిజమే. నిన్ను నీ అమ్మ ఒక యుద్ధ ఖైదీలా పెంచుతూంది. ఈ బొమ్మ సచిన్ టెండూల్కర్‌ది. ఐ పిటీయు ప్రణవీ!” ప్రణవి దిగులుగా, ఆందోళనగా చూసింది. ఈ సచిన్ టెండూల్కర్ ఎవరో తనకు తెలియకపోవడం వలన వచ్చిన ఇబ్బందేమీ లేదు కానీ తనొక యుద్ధ ఖైదీలా పెరుగుతూందట! డామిట్ డర్టీ గర్ల్!

ప్రణవి తల్లి సరళ డిగ్రీ పూర్తి కాగానే ఒక ఇంజనీరుకు కట్నం లేకుండానే భార్య కాగలిగే అవకాశం వచ్చి యూనివర్సిటీ కలల్ని అర్థాంతరంగా పీక నులిమి పెళ్ళి కూతురై తరలి వచ్చింది. ప్రైవేటుగా ఎం.ఎ. అని కొన్నాళ్ళు ఎగిరింది కాని అదీ కుదరలేదు. మోహావేశాలు, యౌవనాశ్వాలపై ఉరుకులు, కళ్ళలోకాంక్షా మధువులు... రెండేళ్ళు తెలియకుండానే గడిచిపోయాయి. అంతట్లోనే మాతృగీతాల సడి. ఆ తరువాత నాలుగేళ్ళు పాపాయితోనే సరిపోయింది. అమ్మ కావడంలో ఎంత మాధుర్యం వుంది! దాని ముద్దు ముద్దు అల్లరి కోర్కెలు చూస్తుండగానే పాపకు స్కూలుకు వెళ్ళే వయసు వచ్చింది. పాప స్కూలుకు వెళ్ళగానే హఠాత్తుగా ఎంతో ఖాళీ! అటక మీది పోస్టు గ్రాడ్యుయేట్ కలల్ని కిందకి దించే లోపల పొత్తి కడుపులో ఏదో బరువుగా తోచి, కాలెండర్‌లో తేదీలు లెక్క చూసుకొంటే అమ్మయ్యో! మళ్ళీ పీరియడ్స్ మిస్ అయ్యాయి. గాడ్! మళ్ళీ మరో తొమ్మిది నెలలు. ఆ కండోమ్స్ మీద భరోసా పెట్టుకోవద్దంటె ఎవడీ మనిషి! ప్రణవి హోమ్‌వర్క్‌పైన శ్రద్ధ చూపడం లేదు – కాన్వెంట్ నుంచి తాకీదు! క్రమంగా నెరవేరని తన యూనివర్సిటీ కలలన్నీ పాపలో చూసుకోవడం మొదలెట్టింది. అదొక అబ్సెషన్ ఐపోయింది. గంటల తరబడి పాప చదువుతో గడిపేది. అటు చూస్తే యిటు చూస్తే అంతటా అక్షరాలే ప్రణవికి. అక్షరాలే ఆహారంగా పెరిగింది ప్రణవి. ఈ ప్రాసెస్‌లో సరళ తల్లిగా కాక క్రమంగా ఒక డిక్టేటర్‌లా మారింది. సినిమాలు, షికార్లు బంద్. స్నేహితులు, సరదాలు బంద్. ఇంటినో సైనిక శిబిరాన్ని చేసింది. కేరింతలు, కోలాహలం లేని బాల్యంలో మంచి సందడి, ఉద్వేగం లేని తొలి యౌవన ప్రపంచంలోనికి వచ్చింది ప్రణవి.

తనకు తెలియకుండానే వజయ ఆకర్షణ వలయంలో గిరగిరా తిరుగుతూంది ప్రణవి. రెండు రోజుల క్రితం సిటీబస్సులో సంఘటన. ప్రణవితో సహా పది మంది సెయింట్ జోసెఫ్స్ అమ్మాయిలు, సిటీబస్సులో ఐదుగురు యూనివర్సిటీ పిల్లలు. ఈవ్ టీజర్స్‌లా

వున్నారు. "చిక్‌బుక్ రైలే! అదిరెను దీని స్టయిలే- అరే జూనియర్ గౌతమిరా. ఏమి ఫీవర్స్‌రా. రెండేళ్ళాగితే పాప చుట్టూ క్యూలు కడతారురా జనం"- 'ట్రింగ్' .. 'ట్రింగ్' డ్రైవర్ స్టాప్ ద బస్! - సజయే. "ఆర్ యు నాట్ అషేమ్డ్ ఆఫ్ యువర్ సెల్ఫ్" "అబ్బో యింగ్లీషులో దంచుతుందిరో" "ఫట్.. ఫట్..." చెంపలు పగిలిపొయ్యాయి. యూనివర్సిటి పిల్లల ముఖాలు కందగడ్డలయ్యాయి. కళ్ళలో నిప్పులు రాలుతుండగా కలకత్తా కాళికలా సజయ. తోక ముడిచారు వాళ్ళు.

"హనీ సినిమాకు వస్తావా" లంచ్ అవర్లో పోయమ్స్ బట్టీ వేస్తున్న ప్రణవి దగ్గరికి వచ్చింది సజయ. Honey I Shrunk the Kids వాల్ట్‌డిస్నీ మూవీ థ్రిల్‌గా ఉంటుంది. పోదాము రా! మధ్యాహ్నం అన్నీ బోర్ క్లాసులే" ఏమి చెప్పాలో అర్థం కాలేదు ప్రణవికి. అలా క్లాసులెగ్గొట్టి సినిమాలకి వెళ్తారని కూడా తెలియదు ప్రణవికి. కాని నో అని చెప్పలేకపోతూంది ఈ సజయ మాటకి.

ప్రణవి ప్రపంచంలో సినిమా అనుభవాలే వేరు. ఏ వేసవి సెలవులలోనో కుటుంబ సమేతంగా ఏ చెత్త తెలుగు సినిమాకో వెళ్ళటం, ఆ సినిమాకు వెళ్ళివచ్చినాక ఎడతెగని తలనెప్పి. సినిమాకు వెళ్ళడమంటేనే చేదు అనుభవం ప్రణవికి. కాని ఈసారి సినిమా అనుభవం వింతగా, ఎక్సైటింగ్‌గా వుంది. ఇద్దరూ ఆటోలో సంగీత్ కెళ్ళారు. రెండు క్యాడ్‌బరీస్, చిప్స్ ప్యాకెట్లు కొన్నారు. సినిమా చూస్తున్నంతసేపు వింతైన ఆనందలోకంలో విహరించింది ప్రణవి.

ఇంటికి వెళ్ళేసరికి ఒక గంభీరమైన వాతావరణం ఎదురైంది. సర్వస్వం కోల్పోయిన దానిలా ఒక మూలన కూర్చుని వుంది వాళ్ళ అమ్మ. కళ్ళు బాగా ఉబ్బి వున్నాయి. బాగా ఏడ్చి వుంటుంది. తండ్రి తనను కోర్టు మార్షల్ చేస్తున్న జడ్జిలా చూశాడు. తమ్ముడు తనను అన్‌టచబుల్‌లా చూశాడు. ఎవరూ పెద్దగా మాట్లాడలేదు. అరచి గొడవా చేయలేదు. కాని ఆ ఇంట్లో ఆ రాత్రి ఎవరూ అన్నం తినలేదు. ఎంత అశాంతి! సజయ చెప్పేది - చైనాలో యుద్ధ ఖైదీల్ని వింత వింత పద్ధతుల్లో హింసించేవారని. ఇదీ అలాంటి ఒక పద్ధతేమో.

ఫిబ్రవరి నెల వచ్చింది. క్యాంపస్‌లో వింతైన స్తబ్దత. ఎవరి మొహం చూసినా టెన్షనే. కనబడీ కనబడని భయం. యుద్ధ వాతావరణం అది. ఆ వాతావరణంలో ఒకే ఒక మినహాయింపు సజయ. "నా మెంటల్ ఎనర్జీని ఇలా టెన్షన్‌తో వృధా చేసుకోను. స్నేహితుల్ని కలవడం, పుస్తకాల్ని చదవడం, సినిమాలకు వెళ్ళడం ఎలాగో పరీక్షలు అంతే నాకు. 'దటీజ్ సజయ' గర్వంగా అనుకొంది ప్రణవి. ఒక్కక్షణం పాటైనా సజయలాగ వుండాలని ప్రయత్నం. ఊహు సాధ్యం కాలేదు. కలలనిండా తగలబడుతున్న అరణ్యాలు! తప్పిపోతున్న రైళ్ళు! కాళ్ళక్రింద భోపాల్ పగుళ్ళు!

అంతట్లోనే గొప్ప విషాదం ఎదురైంది సెయింట్ జోసెఫ్ పిల్లలకు. వాళ్ళ తెలుగుమేడమ్‌కు ఆక్సిడెంట్ అయింది. సిటీబస్ ఎక్కుతూ స్లిప్ అయి క్రిందకు జారిపడింది. బస్సు చక్రాలక్రిందపడి మజ్జుమజ్జు అయ్యాయి ఆమె కాళ్ళు. ఆసుపత్రిలో ఎమర్జన్సీ వార్డులో వుంది. చిన్నారి పాపలు తట్టుకోలేని విషాదం అది. గొల్లుమని ఏడ్చారు. దిగులు ముఖాలు వేసుకొని, అన్నాలు మాని. ప్రణవి సరేసరి పుస్తకాలపైకి మనసు పోవడంలేదు. "హాస్పిటల్‌కు వెళ్ళద్దు. చిన్నపిల్లలు - మనసు పాడవుతుంది. కాన్సన్‌ట్రేషన్ పోతుంది. డాడీ, నేనూ పోయి చూసి వస్తాము. విషయాలన్నీ చెప్తాము" అంటూ ఇల్లు దాటనీయలేదు వాళ్ళ అమ్మ.

ఒక మధ్యాహ్నం ప్రణవికి ఫోన్. "ఇదేమిటే మూల పుస్తకాల జపం చేస్తున్నావు. అక్కడ సజయ చేస్తున్న హడావిడి చెవిన పడలేదా" అని క్లాస్‌మేట్ వసుంధర ఫోన్ చేసింది. "స్కూలు పిల్లలందరితో కలిసి ఊరేగింపుగా కలెక్టర్ దగ్గరికి వెళ్ళి మెమొరాండం ఇచ్చింది సిటీబస్సు డ్రైవర్ని శిక్షించాలని, మేడమ్‌కు నష్టపరిహారం ఇప్పించాలని. ఈ సాయంత్రం టెన్త్ పిల్లలందరినీ తీసుకొని అన్ని స్కూళ్ళకు వెళ్ళి విరాళాలు సేకరిస్తూంది. మేడమ్ ట్రీట్‌మెంట్‌కు చాలా ఖర్చు అవుతుందటగదా."

ఈ హడావిడికి దూరంగా వుండడం అసాధ్యమనిపించింది ప్రణవికి. పుస్తకాలు వదిలేసి స్కూలుకు వచ్చింది. సరికొత్త సజయ. అందరికీ సలహాలిస్తూ అటూ ఇటూ అంతటా హడావిడిగా తిరుగుతూ సజయ. 'సజయా ఐ లవ్‌యు' లోలోపల గొణుక్కుంది ప్రణవి. పెద్ద ఊరేగింపులా తరలివెళ్ళారు సెయింట్ జోసెఫ్ అమ్మాయిలు. వీధిబడి నుంచి పెద్ద పెద్ద కాన్వెంట్లన్నిటికీ వెళ్ళారు. దాదాపు పదిహేనువేలు వసూలయ్యాయి. సాయంత్రం హాస్పిటల్‌కు వెళ్ళి చిన్న బొకే, పండ్లతో పాటు పదిహేను వేలు మేడం చేతిలో పెడుతుంటే ఆమె కళ్ళలో ఆనందబాష్పాలే బాష్పాలు.

రోజులు, వారాలు గడిచాయి. పరీక్షలు ఇంక వారమే.

ఒకరోజు ఉదయం ఒళ్ళు వెచ్చగా వున్నట్టు అనిపించింది ప్రణవికి. మమ్మీకి చెప్తే, "రాత్రంతా మేల్కొని వున్నావుగా. అలసటై వుంటుంది. క్రోసిన్ ఒకటి వేసుకో" అంటూ సలహా ఇచ్చింది. రాత్రికి 102 టెంపరేచర్. "ఇడియట్! పరీక్షలింకా వారమే!! ఇప్పుడీ జ్వరం తెచ్చుకున్నావు. పరీక్షలముందు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని తెలీదు? ఆ మాత్రం జ్ఞానం లేకపోతే ఎలా?" ప్రణవి బిత్తరపోయింది. జ్వరం రావడంలో తన ప్రమేయమేమిటి? స్పెషలిస్టు వచ్చాడు. కాస్ట్‌లీ మందులు, ఇంజక్షన్లు. రేపటికల్లా జ్వరం పోవాలంటుంది అమ్మ. ఇదేమన్న వైద్యమా, మ్యాజిక్కా అన్నట్టు చూశాడు డాక్టరు. మమ్మీ, డాడీల మొహంలో చెప్పలేనంత దిగులు, గొప్ప సామ్రాజ్యాన్ని పోగొట్టుకొన్నవాళ్ళలా.

◆ ఓ వ్యక్తి పోలీసుస్టేషన్‌కు వెళ్ళి "అయ్యా అమధ్య మా ఇంట్లో జొరబడిన దొంగను పట్టేసారని విన్నాను. ఓసారి చూడనిస్తారా?"

"దేనికి?"

"మరేం లేదు.. మా ఆవిడకు మెలుకువ రాకుండా మాఇంట్లో ఎలా ప్రవేశించాడో తెలుసుకుందామని"

— మధుసూదనరావు, కాకినాడ

అంత విషాదంలోను ఏదో తెలియని ఆనందం సజయ రూపంలో ఎదురైంది ప్రణవికి. రాత్రంతా తోడు కూర్చుంది. దగ్గరుండి మందులు వేసింది. అమ్మ మర్చిపోయిన ఆప్యాయతని, టచ్‌ని తను ఇచ్చింది. అంత దుఃఖంలోను గొప్ప సుఖంగా తోచింది ప్రణవికి. రెండవరోజు, మూడవరోజు కూడా వుంది సజయ.

"దాని ఖర్మ అట్లా కాలింది. నువ్వెందుకు చదువు పాడుచేసుకొంటావు నువ్వెళ్ళమ్మా!" అంది అమ్మ. చిరునవ్వుతో "పర్లేదాంటీ! ప్రణవి ఆరోగ్యం కన్నా ఈ పరీక్షలేమీ గొప్పకాదు నాకు" ఎంతమాట! ప్రణవిని సమూలంగా కుదిపివేసిన మాట.

పరీక్షహాలులో కూర్చున్న ప్రణవికి ఎదురుగా క్వశ్చన్‌పేపరు. క్షణకాలం ఆమెలో ఆనందపు అర్ణవం. అన్నీ తెలిసిన ప్రశ్నలే. బాగా తెలిసిన ప్రశ్నలు.

కానీ ... కానీ ... గంట గడిచినా ఆన్సర్‌షీట్‌పై ఒక్కముక్క కూడా రాయని ప్రణవివైపు భయంగా, వింతగా చూసింది ఇన్విజిలేటర్. ప్రణవి మౌనంగా కూర్చుంది. రెండో గంటకూడా ఏమీ రాయకుండానే గడిపింది. రెండు బెంచీల అవతల వున్న సజయ ఆందోళనగా చూసింది ప్రణవివైపు. మంచినీళ్ళకని లేచి ప్రణవివైపు వచ్చి "ఏమైందిరా?" అంది లాలనగా. చిరునవ్వుతో "నథింగ్ టు వర్రీ. రాంకుల విష కౌగిలి నుంచీ బయటపడే ప్రయత్నంలో వున్నాను. నేను పాస్ అవడానికి చివరి ఒక గంట వ్రాస్తే చాలు. 'లెట్ మి రీ బార్న్' ". విస్మయంగా చూసింది సజయ. విషయం అర్థం అయి "బెస్టాఫ్ లక్" అని సాగిపోయింది.

జైల్లో ఇద్దరు ఖైదీలు

◆ "ఎన్నేళ్ళు వేశారు నీకు జైలు"

"రెండేళ్ళు"

"ఎందుకు.."

"బ్యాంకు దోపిడి కేసులో పట్టుబడ్డాను.. మరి మీకెన్నేళ్ళు వేశారు"

"అయిదేళ్ళు"

"దేనికి"

"ఆ బ్యాంకు మేనేజర్ని నేనే"

— కె.వి.